I

సాక్షి సూర్యాపేట

గురువారం । 19 । అక్టోబర్ । 2023



మా బతుకులు మార్చాలి
మేనిఫెస్టోలో లేబర్ బంధు ప్రకటించి మా బతుకులు మార్చాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. - IIలో



వైభవంగా నిత్య కల్యాణం
మట్టపల్లి క్షేత్రంలో బుధవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. - IVలో



భవిష్యత్తును మార్చేది సోషలిజమే
దేశ భవిష్యత్తును మార్చేది సోషలిజమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. - IVలో

న్యూస్‌రీల్

పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా కమిటీ ఎన్నిక


అంకతి వెంకన్న, జిల్లా అధ్యక్షుడు


పి. శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి

సూర్యాపేటటౌన్ : పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా కమిటీని బుధవారం సూర్యాపేట పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అంకతి వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పులుసు శ్రీనివాస్, మహిళా కార్యదర్శిగా ఉమారాణి, జిల్లా ఉపాధ్యక్షుడిగా జాన్‌వెస్లీ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా వంగపల్లి రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళాధ్యక్షురాలు గోలి పద్మ, కృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, అంజయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల విధులను అధికారులు సమర్థంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్టేట్ లెవల్ మాస్టర్ ట్రైనర్స్‌తో 28 మంది పీఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, ఎ. వెంకట్‌రెడ్డిలతో కలసి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. పీఓలు ఈ నెల 27,28తేదీల్లో నాలుగు నియోజకవర్గాల ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, మాక్ పోలింగ్, ఎన్నికల ఫామ్స్ నింపే విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ సాంబిరెడ్డి, మాస్టర్ ట్రైనర్స్ రమేష్, వెంకటేశ్వర్లు, పీఓలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాసరావు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు డి. శ్రీనివాసరావు ఆ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య హైదరాబాదులో బుధవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, కొట్టు శేఖర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో నిత్యారాధనలు


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్య పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వయంభూ, ప్రతిష్టా అలంకార మూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు.రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

కనుల పండువగా శరన్నవరాత్రి ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ప్రాతఃకాల పూజ, అర్చనలు, పారాయణాలు, గాయత్రీ జపాలు, సహస్రనామార్చన, సవావరణ పూజ, కుంకుమార్చన, నీరాజన మంత్ర పుష్పములు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఎస్పీ

కోదాడరూరల్: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా నగదు, మద్యం వంటివి రవాణా కాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే సూచించారు. కోదాడ మండలంలోని రామాపురంక్రాస్‌రోడ్ సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ముఖద్వారం కావడంతో తెలంగాణలోకి వచ్చే ప్రతి వాహనాన్ని ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల నిర్వహణలో ప్రలోభాలను అడ్డుకోవాలని, విలువైన వస్తువులు, ఆభరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, నార్కోటిక్ పదార్థాలు వంటివి ఎలాంటి ఆధారాలు లేకుండా కనిపిస్తే సీజ్ చేయాలని ఆదేశించారు. జీఎస్టీ, ఐటీ అధికారులు నిబంధనలు పాటించాలన్నారు.

సీఎం సభా స్థలి పరిశీలన

కోదాడరూరల్: ఈ నెల 29న కోదాడ పట్టణంలో సీఎం కేసీఆర్ బహిరంగ సభ జరగనున్న నేపథ్యంలో సభా స్థలి, హెలిపాడ్‌ను ఎస్పీ రాహుల్ హెగ్డే బుధవారం పరిశీలించారు. భద్రతకు సంబంధించిన విషయాలను అధికారులకు వివరించారు. అంతకు ముందు కోదాడ పట్టణ , రూరల్ పోలీస్ స్టేషన్లను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ, పోలీస్ స్టేషన్‌ల భౌగోళిక విస్తీర్ణంను పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ ప్రకాష్, పట్టణ, రూరల్ సీఐలు రాము, రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐలు యాదవేందర్‌రెడ్డి, రామాంజనేయులు, సాయిప్రశాంత్ ఉన్నారు.

స్ట్రాంగ్ రూముల తనిఖీ


సూర్యాపేట మార్కెట్‌లో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులోని సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ వెంకట్రావు.. ఎస్పీ రాహుల్‌హెగ్డే బికే, అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డిలతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు, పోలింగ్ మెటీరియల్, పోలింగ్ బాక్సులు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూములను పరిశీలించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్‌కు అధికారులు, సిబ్బంది,ఏజెంట్లకు ప్రవేశం, బారికేడింగ్, పార్కింగ్, మీడియా రూమ్ ఏర్పాట్లపై చర్చించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీరబ్రహ్మచారి, తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ నాగభూషణం, అధికారులు రాములు, శర్మ రాంపతినాయక్, శ్రీనివాసరాజు, వేణు, రామానుజులరెడ్డి పాల్గొన్నారు.

ఎనిమిది సెగ్మెంట్లలో ఆమే.. నిర్ణేత!

◆ 12 నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లు 28,29,357 ◆ అందులో మహిళా ఓటర్ల సంఖ్య 14,25,071



ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలకంగా మారనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి. నాలుగు నియోజకవర్గాల్లో మాత్రం పురుషుల ఓట్ల సంఖ్య కొద్దిగా ఎక్కువ ఉంది. ఎన్నికల్లో గెలుపోటములను, పార్టీల భవిష్యత్తును ప్రభావితం చేసే శక్తి మహిళలకే ఉండటంతో అన్ని రాజకీయ పార్టీలు వారి ఓట్లను రాబట్టుకునే ప్రయత్నాల్లో పడ్డాయి. – సాక్షి ప్రతినిధి, నల్లగొండ

సగానికి పైగా స్థానాల్లో మగువలదే పైచేయి

- అభ్యర్థుల గెలుపోటముల్లో వారే కీలకం
- మహిళల ఓట్లను రాబట్టుకునేందుకు ప్రధాన పార్టీల వ్యూహాలు
- మేనిఫెస్టోల్లో వారికి ప్రత్యేక హామీలు
- ప్రచార సభలకు మహిళలు ఎక్కువగా వచ్చేలా అభ్యర్థుల కార్యాచరణ

ఉమ్మడి జిల్లాలో మహిళల ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. 12 నియోజకవర్గాల్లో మొత్తం 28,29,357 మంది ఓటర్లలో పురుషులు 14,04,111 మంది, మహిళా ఓటర్లు 14,25,071 మంది ఉన్నారు. ఇక ట్రాన్స్‌జెండర్లు 195 మంది ఉన్నారు. ఇంట్లో ఓట్లను కూడా మహిళలు ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో వారిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో అన్ని రాజకీయ పార్టీలు నిమగ్నమయ్యాయి. మహిళా ఓటర్లలో సైలెంట్ ఓటింగ్ ఎక్కువగా ఉండనుండటంతో వారిని ఆకట్టుకునేలా ప్రసంగాలు, ప్రచార ఏర్పాట్లతో అభ్యర్థులు సిద్ధమయ్యారు.

అత్యధికంగా 5,366 మంది

పురుషుల కంటే మహిళా ఓటర్లు అత్యధికంగా ఉన్న 8 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గంలో 421 నుంచి మొదలుకొని 5,366 మంది ఉన్నారు.

మిగతా చోట్ల ఐదు వేలే తక్కువ..

ఉమ్మడి జిల్లాలోని మిగతా నాలుగు నియోజకవర్గాల్లో మహిళ ఓటర్ల సంఖ్య చాలా తక్కువ ఏమీ లేదు. అన్ని నియోజకవర్గాలు కలిపితే కేవలం 5వేల మంది పురుషుల కంటే మహిళ ఓట్లు తక్కువగా ఉన్నారు. అందులో దేవరకొండ, మునుగోడు, తుంగతుర్తి, ఆలేరు నియోజకవర్గాలు ఉన్నాయి.

మొత్తంగా చూస్తే ఆ నియోజకవర్గాల్లో 26,477 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ప్రత్యేకించి ఆ ఎనిమిది సెగ్మెంట్లలో మొత్తం ఓటర్లు 18,63,122 ఉంటే అందులో 9,18,253 మంది పురుషులు, 9,44,730 మంది మహిళలు ఉన్నారు. అత్యధికంగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మహిళా ఓటర్లు 5366 మంది ఎక్కువ ఉన్నారు. నల్లగొండలో 4,839 మంది, నకిరేకల్‌లో 421 మంది, నాగార్జునసాగర్‌లో 3,334 మంది, మిర్యాలగూడలో 3,265, సూర్యాపేటలో 3,938, కోదాడలో 4,760, భువనగిరిలో 554 మంది మహిళా ఓటర్లు పురుషులకంటే ఎక్కువగా ఉన్నారు.

మహిళా ఓటర్లు అధికంగా ఉన్న నియోజకవర్గాల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
నల్లగొండ	1,16,487	1,21,326	53	2,37,866
నకిరేకల్	1,22,021	1,22,442	4	2,44,467
నాగార్జునసాగర్	1,12,613	1,15,947	20	2,28,580
మిర్యాలగూడ	1,11,169	1,14,434	23	2,25,626
సూర్యాపేట	1,15,638	1,19,576	17	2,35,231
హుజూర్‌నగర్	1,18,664	1,24,030	17	2,42,711
కోదాడ	1,16,257	1,21,017	15	2,37,289
భువనగిరి	1,05,404	1,05,958	0	2,11,362
మొత్తం	9,18,253	9,44,730	149	18,63,132

ఈ నియోజకవర్గాల్లో మహిళలు తక్కువ

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
దేవరకొండ	1,22,161	1,19,291	15	2,41,467
మునుగోడు	1,24,473	1,23,996	5	2,48,474
తుంగతుర్తి	1,24,836	1,23,722	8	2,48,566
ఆలేరు	1,14,388	1,13,332	18	2,27,738
మొత్తం	4,85,858	4,80,341	46	9,66,245

సభలకు వచ్చేలా ప్రణాళికలు..

ఇప్పటికే ప్రచారంలోకి దిగిన నేతలు తమ వెంట ఎక్కువగా మహిళలు ఉండేలా చూసుకుంటున్నారు. సభలు, సమావేశాలకు ఎక్కువ మంది మహిళలు వచ్చేలా ప్రణాళికలు రూపొందించకుంటున్నారు. ముఖ్యంగా మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులను రంగంలోకి దింపుతున్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారితో చెప్పించడం ద్వారా మహిళా ఓటర్లను ఆకర్షించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

అతివలే లక్ష్యంగా మేనిఫెస్టోలు

ఈ ఎన్నికల్లో అతివలే లక్ష్యంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు మేనిఫెస్టోలు ప్రకటించాయి. వారిని ఆకట్టుకునేలా మేనిఫెస్టోలలో హామీలను పొందుపరిచాయి. తాము మళ్లీ అధికారంలోకి వస్తే అర్హులైన మహిళలకు ప్రతి నెలా రూ.3 వేల జీవనభృతి, రూ.400కే గ్యాస్ సిలిండర్, మహిళా సంఘాల సమాఖ్యలన్నింటికి సొంత భవనాల నిర్మాణం వంటి హామీలను బీఆర్‌ఎస్ ప్రకటించింది. ఇక కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మొదటగా మహాలక్ష్మిని పేర్కొంది. ఈ పథకం కింద ప్రతి నెలా రూ. 2,500 ఇస్తామని ప్రకటించింది. రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటివి ప్రకటించింది.

మహిళలూ.. మీకు వందనం

అధికార బీఆర్‌ఎస్ పార్టీ, కాంగ్రెస్, బీజేపీలు మహిళల ఓట్లను రాబట్టుకునే విషయంలో లెక్కలు వేసుకుంటున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రంలో ఇప్పటికే మహిళల కోసం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, న్యూట్రిషన్ కిట్, కేసీఆర్ కిట్, ఒంటరి మహిళలకు పెన్షన్, గృహలక్ష్మి వంటి పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలతో మండలాలు, గ్రామాల వారీగా కరపత్రాలను ముద్రించి ప్రచారంలోకి దిగింది. కాంగ్రెస్ పార్టీ కూడా ఆ దిశగా తమ ఆరు గ్యారంటీలతో ప్రచారం మొదలుపెట్టింది.



● బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..


సూర్యాపేట పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం ఆధ్వర్యంలో బుధవారం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

గుట్టుచప్పుడు కాకుండా..

- అధికారులు ఎన్నికల హడావుడిలో ఉండగా చేప పిల్లల పంపిణీ
- కాంట్రాక్టర్లు నాసిరకం, చనిపోయిన చేప పిల్లలు వదులుతున్నట్లు ఆరోపణలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు

అత్మకూర్ (ఎస్)మండలంలో రెండురోజులుగా చేపపిల్లలను గుట్టుచప్పుడు కాకుండా చెరువుల్లోకి వదులుతున్నట్లు తెలుస్తోంది. మండలంలో 13.80 లక్షల చేపపిల్లలను వదలాల్సి ఉంది. నెమ్మికల్ చౌదచెరువులో 1.02లక్షల చేప పిల్లలకు గాను కాంట్రాక్టర్లు ఈనెల 17న 7వేలు మాత్రమే పోసినట్లు స్థానిక మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. వీటిలోనూ సగం వరకు మృతిచెంది ఉన్నట్లు చెబుతున్నారు. దీనిపై గ్రామ మత్స్యసొసైటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదీ.. చేప పిల్లల పంపిణీ పథకం అమలు తీరుకు నిదర్శనం.


నెమ్మికల్‌లోని చౌదచెరువులో చనిపోయిన చేపపిల్లలు

భానుపురి / ఆత్మకూర్ (ఎస్) : మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉచితంగా చేప పిల్లల పంపిణీ పథకాన్ని చేపట్టింది. కానీ ఈ పథకం అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ల చిత్తశుద్ధిలోపంతో అభాసుపాలవుతోంది. వివిధ కారణాలు చూపుతూ ఇంతకాలం చేప పిల్లలు పోయనేలేదు. అదునుదాటిన తర్వాత ఇప్పుడు అధికారులు ఎన్నికల బిజీలో ఉండగా కాంట్రాక్టర్లు గుట్టుచప్పుడు కాకుండా లెక్కాపత్రంలేకుండా నాసిరకం, చనిపోయిన చేప పిల్లలు పోస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

లక్ష్యం 3.50 కోట్ల చేప పిల్లలు

జిల్లాలో 1340 నీటి వనరులు (చెరువులు, కుంటలు) ఉన్నాయి. 134 మత్స్య పారిశ్రామిక సంఘాలు, 3 మహిళా మత్స్య పారిశ్రామిక సంఘాలు, 5 మత్స్య పారిశ్రామిక మార్కెటింగ్ సహకార సంఘాలు ఉండగా.. వీటిలో 15,736 మంది సభ్యులుగా ఉన్నారు. అయితే 2023వ సంవత్సరంలో జిల్లాలోని అన్ని నీటి వనరుల్లో కలిపి దాదాపు 3.50 కోట్ల చేపపిల్లలను వదలాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వాస్తవానికి ఆగస్టులోనే చేప పిల్లలను పోయాల్సి ఉంది. కానీ జూన్ 17న టెండర్ల ప్రక్రియ మొదలు కాగా మత్స్యశాఖ జిల్లా అధికారుల తీరుతో మూడు నెలల పాటు సాగింది. చివరకు సెప్టెంబర్ రెండోవారంలో టెండర్ల ప్రక్రియ ముగిసిందని, ఇద్దరు కాంట్రాక్టర్లు చేపపిల్లల పంపిణీకి ముందుకొచ్చినట్లు తెలిపి వారంలోనే పంపిణీని ప్రారంభిస్తామని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఇది గడిచి నెలరోజులు దాటింది. నాటినుంచి జిల్లాలో చేపపిల్లల పంపిణీ ఊసెత్తకుండా జిల్లా మత్స్యశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించినట్లు ముదిరాజ్ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికల సమయం కావడంతో అధికారుల పర్యవేక్షణ ఉండదని, ఇష్టానుసారంగా చేపపిల్లలను చెరువుల్లోకి వదిలి సొమ్ము చేసుకోవచ్చన్న ఆలోచనతో కాంట్రాక్టర్లు ఉన్నట్లు మత్స్యకారులు అంటున్నారు. నేరేడుచర్ల మండలం పెంచికల్ దిన్నె, మఠంపల్లి మండలం యాతవాకిళ్లలో కొద్దిరోజుల క్రితం ఈ పథకాన్ని ప్రారంభించారు. ఆయా చోట్ల లెక్కాపత్రం లేకుండా చేప పిల్లలను వదిలారు. పులిచింతల ప్రాజెక్టులోనూ చేప పిల్లలను వదిలి పథకానికి శ్రీకారం చుట్టారు ఆ తర్వాత ఎక్కడా చేప పిల్లలు వదిలిన దాఖలాలు లేవు. వివరణ కోసం జిల్లా మత్స్యశాఖ అధికారికి ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కయ్యారు



తెలంగాణ ప్రభుత్వం ముదిరాజ్‌లను ఆదుకునేందుకు చేపట్టిన పథకం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. మత్స్య సొసైటీ సభ్యులకు ఎలాంటి లాభం లేకుండా పోతోంది. నెమ్మికల్ చౌడ చెరువులో లెక్కాపత్రం లేకుండా నాసిరకం చేపలను వదిలారు. చాలా పిల్లలు చనిపోయినవే ఉన్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఏటా సకాలంలో పిల్లలను వదలాలి.
– గంగరబోయిన శ్రీనివాస్, నెమ్మికల్, సొసైటీ సభ్యుడు

ముదిరాజ్‌లను విస్మరించిన పార్టీలను ఓడించాలి


సూర్యాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

సూర్యాపేట : రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతంగా ఉన్న ముదిరాజ్‌లను రాజకీయంగా విస్మరించిన పార్టీలను త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు బోళ్ల కరుణాకర్ పిలుపునిచ్చారు. బుధవారం సూ ర్యాపేట పట్టణంలో నిర్వహించిన ముదిరాజ్‌ల రాజకీయ నిరసన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ ఇటీవల ప్రకటించిన అసెంబ్లీ సీట్లలో ఒక్కటి కూడా ముదిరాజ్‌లకు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. మిగతా రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు జనాభా దామాషా ప్రకారం అసెంబ్లీ సీట్లు కేటాయించకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని రెండు అగ్రకులాలు మాత్రమే తమ గు ప్పెట్లో పెట్టుకొని అధికారాన్ని చెలాయిస్తున్నాయని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంతా ఒక్కటై రానున్న ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాలను గెలిపించుకుంటామని తెలిపారు. ముదిరాజ్‌లకు ప్రాధాన్యమిచ్చిన పార్టీ గెలుపునకు పనిచేస్తామన్నారు. యువత రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మరగోని రాజు ముదిరాజ్ మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గంలో ముదిరాజ్‌లకు అవకాశం ఇస్తే ముది రాజులమంతా కలిసి గెలిపించుకుంటామన్నా రు. ఈర్యాలీలో అరిగే సైదులు ముదిరాజ్, పిట్టల శంకర్ ముదిరాజ్, కోల కరుణాకర్ ముదిరాజ్, చెక్కల వీరభద్రం, సిరికొండ సురేష్, నీలం కృష్ణ , గంగరబోయిన శ్రీను ముదిరాజ్, లొంక అశోక్ ముదిరాజ్, బైరి రామ్మూర్తి ముదిరాజ్, జోర్క లింగయ్య ముదిరాజ్, కర్కాల రమేష్ ముదిరాజ్, చింతల సైదులు ముదిరాజ్, చెక్కల నాగరాజు ముదిరాజ్ పాల్గొన్నారు.

● ఎన్నికల 'చిత్రాలు'


నల్లగొండలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి


చిట్యాలలో ఓటు అభ్యర్థిస్తున్న బీఎస్పీ అభ్యర్థి ప్రియదర్శిని


అనంతగిరి : గోండ్రియాలలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి


దామరచర్లలో ఎమ్మెల్యే భాస్కర్‌రావుకు తిలకందిద్దుతున్న మహిళ


భూదాన్ పోచంపల్లిలో వృద్ధురాలితో కలిసి నృత్యం చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

మిర్యాలగూడలో విలక్షణ తీర్పు

జంగ్ తెలంగాణ







ఎక్కువసార్లు కాంగ్రెస్, కమ్యూనిస్టులకే పట్టం

- హ్యాట్రిక్ కొట్టిన తిప్పన చినకృష్ణారెడ్డి
- ఆసియా ఖండంలో అత్యధిక రైస్ మిల్లులు ఉన్న ప్రాంతం ఇదే..

అసెంబ్లీ ఫ్లాష్‌బ్యాక్

మిర్యాలగూడ : ఆసియా ఖండంలోనే అత్యధిక రైస్ మిల్లుల ఉన్న ప్రాంతంగా పేరుగాంచింది మిర్యాలగూడ. ఈ ప్రాంతం తెలంగాణ బియ్యపు పాత్ర (రైజ్ బౌల్)గా వెలుగొందుతోంది. కృష్ణా, మూసీ నదుల సంగమం ఇక్కడే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యాదాద్రి థర్మల్ ప్లాంట్ ఈ నియోజకవర్గంలోనే నిర్మితమవుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం తర్వాత ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందింది. ఇక్కడి ఓటర్లు కాంగ్రెస్, కమ్యూనిస్టులకే ఎక్కువసార్లు పట్టం కట్టారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో 14 సార్లు ఎన్నికలు జరిగితే ఏడు సార్లు కాంగ్రెస్, ఐదు సార్లు సీపీఎం, ఒక సారి పీడీఎఫ్, ఒక సారి టీఆర్ఎస్ గెలిచాయి. రైస్ ఇండస్ట్రీలు ఎక్కువగా ఉండడం, అందులో పనిచేసే కార్మికులు, సాగర్ ఆయకట్టు రైతులు, రైతు కూలీలు అధికంగా ఎక్కువగా కమ్యూనిస్టుల అండగా నిలిచారు.




చినకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, విజయసింహారెడ్డి


రంగారెడ్డి


భాస్కర్‌రావు

ఎమ్మెల్యేలైన తండ్రీకొడుకులు..

మిర్యాలగూడ నియోజకవర్గంలో తండ్రీకొడుకులు ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించారు. 1962, 1967, 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున తిప్పన చిన కృష్ణారెడ్డి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. 1989లో కాంగ్రెస్ తరుపున పోటీ చేసిన ఆయన కుమారుడు తిప్పన విజయ సింహారెడ్డి గెలిచారు.

ఇప్పటివరకు మిర్యాలగూడ ఎమ్మెల్యేలు వీరే..

సంవత్సరం	ఎమ్మెల్యే	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ
1957	సి.వెంకట్‌రెడ్డి	పీడీఎఫ్	డి.నర్సింహారెడ్డి	ఐఎన్‌సీ
1962	తిప్పన చినకృష్ణారెడ్డి	కాంగ్రెస్	చల్లా సీతారాంరెడ్డి	సీపీఎం
1967	తిప్పన చినకృష్ణారెడ్డి	కాంగ్రెస్	చల్లా సీతారాంరెడ్డి	సీపీఎం
1972	తిప్పన చినకృష్ణారెడ్డి	కాంగ్రెస్	ఎంఎస్.రామయ్య	సీపీఎం
1978	అరిబండి లక్ష్మీనారాయణ	సీపీఎం	టి.లింగయ్య	కాంగ్రెస్
1983	చకిలం శ్రీనివాస్‌రావు	కాంగ్రెస్	అరిబండి లక్ష్మీనారాయణ	సీపీఎం
1985	అరిబండి లక్ష్మీనారాయణ	సీపీఎం	చలీనమ్మ	కాంగ్రెస్
1989	తిప్పన విజయసింహారెడ్డి	కాంగ్రెస్	అరిబండి లక్ష్మీనారాయణ	సీపీఎం
1994	జూలకంటి రంగారెడ్డి	సీపీఎం	తిప్పన విజయసింహారెడ్డి	కాంగ్రెస్
1999	రేపాల శ్రీనివాస్	కాంగ్రెస్	సుందరి అరుణ	టీడీపీ
2004	జూలకంటి రంగారెడ్డి	సీపీఎం	బొరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి	టీడీపీ
2009	జూలకంటి రంగారెడ్డి	సీపీఎం	తిరునగరు గంగాధర్	కాంగ్రెస్
2014	నల్లమోతు భాస్కర్‌రావు	కాంగ్రెస్	అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి	టీఆర్ఎస్
2018	నల్లమోతు భాస్కర్‌రావు	టీఆర్ఎస్	ఆర్.కృష్ణయ్య	కాంగ్రెస్

● పీపుల్స్ ఎజెండా

మా బతుకులు మార్చాలి

- సర్కార్ స్పందిస్తేనే మా రాత మారుతుంది
- రోజూ పనిదొరుకుతుందన్న గ్యారంటీ లేదు
- పనిలేకుంటే.. పస్తులుంటున్నాం
- లేబర్ బంధు ప్రకటించి ఆదుకోవాలి
- ప్రతి కార్మికునికి లేబర్ కార్డు ఇవ్వాలి
- ప్రమాద బీమాను రూ.10లక్షలకు పెంచాలి

'అడ్డా' సాక్షిగా.. భవన నిర్మాణ కార్మికుల డిమాండ్



ఆవుల లక్ష్మయ్య, వంగాల శ్రీనివాస్‌రెడ్డి

ఆ రోజు వారు పని చేస్తేనే.. ఆ కుటుంబం ఆకలి తీరుతుంది. లేదంటే పస్తులే. ఉదయాన్నే సద్ది కట్టుకుని పని కోసం అడ్డా మీదికి వెళ్తే అక్కడ గంటల కొద్దీ నిరీక్షణ. ఎండయినా.. వానయినా అలా రోడ్డుపైన.. దుకాణాల ఎదుట నిలబడాల్సిందే. పని దొరికినా వచ్చే కూలి అరకొరే. ఆ డబ్బుతో పూటగడవక దుర్భర జీవితాలు గడుపుతున్నారు అడ్డా కూలీలు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా తమ బతుకుల్లో వెలుగు రావడం లేదని అంటున్నారు. ప్రస్తుతం శాసనసభ ఎన్నికల నేపథ్యంలో నల్లగొండ పట్టణంలోని భాస్కర్ టాకీస్ అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మికులను 'సాక్షి' పలకరించగా.. వారి సమస్యలను ఏకరువు పెట్టారు.


నల్లగొండలోని భాస్కర్ టాకీస్ అడ్డా వద్ద పని కోసం వేచి ఉన్న కార్మికులు

దళితబంధు, బీసీ బంధు మాదిరిగా భవన నిర్మాణ కార్మికులకు లేబర్‌బంధు ప్రకటించేందుకు అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని భవన నిర్మాణ కార్మికులు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నారు. పనిచేస్తేనే పూడగడిసే పరిస్థితుల్లో కార్మికులకు చేతినిండా పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అడ్డాల వద్ద కూలీల కోసం షెడ్డు నిర్మాణం, మౌలిక సదుపాయాలైన మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించాల్సిన అవసరం ఉందంటున్నారు. కార్మికుల పిల్లల చదువు కోసం ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు, ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి ఇచ్చే ఆర్థిక సాయం రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి సంక్షేమ బోర్డు ద్వారా ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. నెలలో 10 నుంచి 15 రోజులు మాత్రమే పనిదొరుతుందని పనిదొరకని రోజుల్లో పూట గడవడం కష్టతరంగా మారుతున్నందున పూర్తిస్థాయిలో ఉపాధిని కల్పించేందుకు ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. భవన నిర్మాణ కార్మికుల అభిప్రాయాలు ఇలా..

ప్రమాద బీమా పెంచాలి



భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేస్తున్న బీమాను రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలి. అనేక మంది కార్మికులు పనిచేసే సమయంలో కింద పడి మరణిస్తున్నారు. దాంతో వారి కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తోంది.

– జంజిరాల జానయ్య, ముషంపల్లి

లేబర్‌బంధు ఇవ్వాలి



25 సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నా. కొన్ని సార్లు పని దొరకక ఇబ్బందులు పడుతున్నా. నిరంతరం అష్టకష్టాలు పడుతున్న భవన నిర్మాణ కార్మికులకు దళితబంధు మాదిరిగా లేబర్‌బంధు ఇచ్చే విధంగా అన్ని రాజకీయ పార్టీలు హామీలు ఇవ్వాలి.

– సత్తయ్య, నల్లగొండ

బ్యాంకు రుణాలు ఇప్పించాలి



భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న మాకు నెల రోజులు పనిదొరకక కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నాం. సంక్షేమ బోర్డునుంచి రుణం ఇప్పిస్తే సెంట్రింగ్ సామగ్రిని ఏర్పాటు చేసుకుని ఉపాధిని పొందుతా.

– నల్ల శ్రీకాంత్ , చందుపట్ల

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి



భవన నిర్మాణ కార్మికులకు డబుల్ బెడ్ ఇళ్లు ఇవ్వాలి. ఇందుకోసం ప్రత్యేక కోటా కేటాయించాలి. ఇళ్లు లేక అనేక మంది కార్మికులు అద్దె ఇళ్లలో నివాసం ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కోటా అమలు చేసి ఆదుకోవాలి.

– కల్లెట్ల వెంకన్న, బీటీఎస్, నల్లగొండ

యాభై ఏళ్లు నిండిన వారికి పింఛన్ ఇవ్వాలి



భవన నిర్మాణ కార్మికులకు యాభై సంవత్సరాలు వచ్చే సరికి పనిచేయడానికి ఆరోగ్యం సహకరించదు. బరువుతో కూడిన పని అయినందున వయస్సు మీద పడితే పని చేయలేకపోతున్నాం. యాభై ఏళ్లు దాటిన వారికి నెలకు రూ.5 వేల చొప్పున పింఛన్ ఇవ్వాలి.

– కొంపెల్లి యాదమ్మ, ఊటుక్కూరు

ప్రతి కార్మికుడికి లేబర్ కార్డు ఇవ్వాలి



కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులందరికి లేబర్ కార్డులను ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం, పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందించాలి. కార్డు ద్వారా సబ్సిడీ రుణాలను ఇప్పించాలి.

– సాగర్ల మల్లయ్య, పానగల్

ఇంటి స్థలం ఇవ్వాలి



ఊర్లో పని దొరకక కుటుంబ పోషణ కోసం పట్టణానికి పనికోసం వచ్చా. ఇక్కడ అద్దె ఇళ్లలో ఉంటున్నాం. రోజూ పని దొరక్కపోవడంతో పాటు రోజు వారి ఖర్చులు పెరిగి ఇంటి అద్దె కట్టలేకపోతున్నాం. ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చి ఆదుకోవాలి.

– మెగావత్ చిట్టమ్మ, జూనూతులతండా

హెల్త్ కార్డులను ఇప్పించాలి



భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు నిత్యం ఏదో ఒక ప్రమాదం బారిన పడుతుంటారు. ఆ సమయంలో వైద్యం చేయించుకునే స్థోమత లేనివారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ప్రతి కార్మికుడికి రూ.20 లక్షల విలువ చేసే హెల్త్ కార్డులు అందించి ఆదుకోవాలి.

– ఆలకుంట్ల విజయ, వెలుగుపల్లి

పార్వతీరామలింగేశ్వర ఆలయంలో చోరీ


చోరీ జరిగిన గదిని పరిశీలిస్తున్న అర్చకుడు

మద్దిరాల: మండల కేంద్రంలోని పార్వతీరామలింగేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయ అర్చకుడు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామి ఆలయంలోకి చొరబడి రూ.2లక్షల విలువైన పురాతన వస్తువులను అపహరించారు. బుధవారం తెల్ల వారుజామున ఆలయంలోకి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆలయ అర్చకుడు ప్రసాద్‌శర్మ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏ. రవీందర్ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

చందంపేట: భార్య కాపురానికి రావడం లేదని పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ ఘటన చందంపేట మండలం పోలేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటిగానితండాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటిగానితండాకు చెందిన సపావత్ చీన్య(35)కు 13ఏళ్ల క్రితం పోల్యానాయక్‌తండాకు చెందిన సునీతతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు హైదరాబాద్‌లో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే గత కొన్ని నెలలుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సునీత తన తల్లిగారింటికి వెళ్లి అక్కడే ఉంటుంది. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన చీన్య మంగళవారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా బుధవారం మృతిచెందాడు.

జీవితంపై విరక్తితో..

రామగిరి(నల్లగొండ): జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తిప్పర్తి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన బత్తుల భద్రయ్య(75) 5 సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. జీవితం మీద విరక్తి చెంది మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి కుమారుడు బత్తుల సోమరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్. ధర్మ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఉరేసుకొని ఆత్మహత్య

పెన్‌పహాడ్: పెళ్లి కాలేదని జీవితంపై విరక్తితో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండలంలోని లింగాల గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఏఎస్ఐ వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. లింగాల గ్రామానికి చెందిన తడకమళ్ల మధుకుమార్(53)కు పెళ్లి కాకపోవడంతో తన ఇంట్లో ఒంటరిగా ఉండేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. తన చావుకు ఎవరూ కారణం కాదని, జీవితంపై విరక్తితో చనిపోతున్నానని మృతుడు రాసిన సూసైడ్ నోట్ లభించినట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతుడి సోదరుడు యాదగిరి లక్ష్మీనరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి బలవన్మరణం

సూర్యాపేట రూరల్: ఉరేసుకొని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని కేటీ అన్నారం రోడ్డులో గల జాహ్నవి టౌన్‌షిప్ వద్ద బుధవారం ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు వేరే రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతుడి వివరాల కోసం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

130 కిలోల వెండి వస్తువులు స్వాధీనం


సూర్యాపేట క్రైం: పట్టుబడిన దుస్తులు, సూట్‌కేసులను పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

సూర్యాపేట క్రైం: సూర్యాపేట పట్టణానికి చెందిన ఓ వ్యాపారి ఇంట్లో 130 కిలోల వెండి వస్తువులను బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. సూర్యాపేట పట్టణంలోని పూలసెంటర్‌లో పట్టణానికి చెందిన ఉత్తమ్ డోర్ కర్టన్స్ వ్యాపారం చేస్తున్నాడు. అతడి ఇంట్లో భారీగా వెండి వస్తువులు నిల్వ ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం పట్టణ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేయగా.. వెండితో తయారుచేసిన కుంకుమ భరిణలు, గ్లాసులు, ప్లేట్లు, మెడలో వేసుకునే చైన్లు, బ్రాస్‌లెట్స్ లభ్యమయ్యాయి. దీంతో పోలీసులు ఆ వస్తువులను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వెండి వస్తువులకు సంబంధించి ఎలాంటి బిల్లులు కూడా వ్యాపారి వద్ద లేవని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

రూ.31లక్షల విలువైన దుస్తులు సీజ్..

కోదాడరూరల్ : ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల, పరిగి, వనపర్తి ప్రాంతాలకు దుస్తులు తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని తనిఖీ చేశారు. అందులోని రూ.31లక్షల విలువైన దుస్తులతో పాటు దుస్తులు కొనుగోలు చేస్తే ఆఫర్ కింద ఇచ్చేందుకు సూట్‌కేసులు కూడా తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. కాగా దుస్తులు, సూట్‌కేసులకు తరలింపునకు సంబంధించి సరైన ఆధారాలు చూపని కారణంగా వాటిని సీజ్ చేసినట్లు రూరల్ ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

మోతె మండలంలో 110 పట్టుచీరలు..

మోతె: మండలంలోని మామిళ్లగూడెం టోల్‌ప్లాజా వద్ద ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై బుధవారం వాహనాల తనిఖీల్లో భాగంగా ఓ కారులో 110 పట్టుచీరలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం పట్టణానికి చెందిన బట్టల వ్యాపారి స్కందం వెంకటేశ్వర్లు ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు కారులో రూ.5లక్షల విలువ గల 110 పట్టుచీరలను తీసుకెళ్తుండగా.. సరైన ఆధారాలు చూపకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నట్లు మోతె ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

చింతపల్లిలో రూ.3.70లక్షలు..

చింతపల్లి: మండల కేంద్రంలో హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై బుధవారం వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు రూ.3.70లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాకు చెందిన మాల్యాద్రి ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.3.70లక్షలు తీసుకెళ్తుండగా సీజ్ చేసినట్లు ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం


సునంద

హుజూర్‌నగర్: మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైంది. ఎస్ఐ జహంగీర్ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌లోని చైతన్య కాలనీకి చెందిన లింగనబోయిన సునంద తన భర్తతో విడాకులు తీసుకొని తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఆమె మతిస్థిమితం కోల్పోవడంతో కుటుంబ సభ్యులు పలు హాస్పిటల్స్‌లో చికిత్స చేయించి ఇంటి వద్దనే ఉంచుకుంటున్నారు. కాగా ఈ నెల 16వ తేదీన ఉదయం సునంద ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె అన్న లింగనబోయిన శ్రావణకుమార్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

హుజూర్‌నగర్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం రాత్రి హుజూర్‌నగర్ పట్టణ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మాధవరాయినిగూడేనికి చెందిన మస్తాన్ బుధవార రాత్రి హుజూర్‌నగర్ నుంచి గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో దద్దనాల చెరువు కాలనీ సమీపంలోకి రాగానే ఆగి ఉన్న లారీని ఢీకొని కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి హుజూర్‌నగర్ ఏరియా హాస్పిటల్‌కు తరలించగా అక్కడి డాక్టర్లు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్య కోసం సూర్యాపేట తరలించారు.

రైతులకు ఇచ్చే హామీలను వెంటనే ప్రకటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

హుజూర్‌నగర్‌రూరల్: రైతుల కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలు ఏం చేస్తారో ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వక్కవంతుల కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సీతారాంపురంలో నిర్వహించిన అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కమిటీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతుల రక్షణ కోసం ఏ ఒక్క పార్టీ కూడా ఎన్నికల ప్రణాళికలో హామీ ఇవ్వలేదని ఆరోపించారు. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ నినాదం మరోసారి జోరు అందుకుందని తెలిపారు. ఎన్నికల ప్రచారానికి వచ్చే రాజకీయ పార్టీల నాయకులను 'రైతుల పక్షాన నిలబడి వ్యవసాయాన్ని కాపాడండి, రైతును రక్షించాలి' అనే నినాదంతో ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర సహాయ కార్యదర్శి డెవిడ్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నేటికీ అమలు చేయకుండా రైతులను నట్టేట ముంచిందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య, డివిజన్ అధ్యక్షుడు మేకల కనకారావు, నాయకులు నాగయ్య, వెంకటేశ్వర్లు, వెంకన్న, సరోజన, లక్ష్మి, రామలింగమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

23న విజయదశమి

భానుపురి (సూర్యాపేట) : విజయదశమి (దసరా) పండుగ 23న నిర్వహించుకోవాలని తెలంగాణ విద్వత్‌సభ నిర్ణయించినట్లు వైదిక బ్రాహ్మణ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు మంత్రమూర్తి శంకరమూర్తి తెలిపారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైదిక బ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి అచ్యుతారామశర్మ, పట్టణ కార్యదర్శి యల్లంభట్ల రమేష్‌శర్మ, నాగయ్యశాస్త్రి, మంత్రమూర్తి లక్ష్మణశాస్త్రి, పులి హరిప్రసాద్‌శర్మ, అరిపిరాల జనార్దన్‌శర్మ, ఇరువంటి శివరామకృష్ణ, రెంటాల సతీష్‌శర్మ, తేరాల కిశోర్‌శర్మ, కృష్ణమూర్తిశర్మ, మంత్రమూర్తి ప్రసాద్‌శర్మ, వశిష్టాశర్మ, విశ్వేశ్వర శర్మ, వెంకటాచార్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



లక్ష్మమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న వట్టె జానయ్య యాదవ్

పెన్‌పహాడ్: మండల పరిధిలోని చీదెళ్ల గ్రామానికి చెందిన పందుల నాగమ్మ, బాల వెంకన్నలు అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని సూర్యాపేట బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టె జానయ్య యాదవ్ బుధవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన ఎల్లంల లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట అవుల అంజయ్య, వల్లాల సైదులు, గోపిరెడ్డి, సోమిరెడ్డి, సైదులు, నాగరాజు, బుచ్చిరాములు, పందుల నాగరాజు, జాల నాగరాజు, సత్యనారాయణరెడ్డి, శ్రీను, జానయ్య, కోటేష్, సతీష్, రాజు తదితరులున్నారు.

బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ మండల కమిటీ ఎన్నిక

పెన్‌పహాడ్: బంజారా ఎంప్లాయిస్ సేవాసంఘ్ మండల కమిటీని బుధవారం మండల కేంద్రంలో ధరావత్ అజయ్‌నాయక్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దరావత్ రమేష్ నాయక్, ఉపాధ్యక్షులుగా వంకుడోతు కళావతి, ఇందిరా, సంధ్య, ప్రధాన కార్యదర్శిగా మనోజ్ నాయక్, కోశాధికారిగా అజ్మీరా హుస్సేన్, కార్యదర్శులుగా ఆంగోతు యాదగిరి, విజయ, రాములు నాయక్, గౌరవ సలహాదారులు రమావత్ గోపి, కృష్ణసందీప్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రఘుపతినాయక్, రమేష్ నాయక్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించకపోవడం తగదు

అర్వపల్లి: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన అభ్యర్థుల మొదటి జాబితాలో సూర్యాపేట స్థానాన్ని ప్రకటించకపోవడం తగదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి అన్నారు. బుధవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని సూర్యాపేట అభ్యర్థిగా మొదటి జాబితాలోనే ప్రకటిస్తే ఆయనను పార్టీ గౌరవించినట్లు ఉండేదని పేర్కొన్నారు. 40ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నారని, 5సార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా, ఒకసారి ఇండిపెండెంట్‌గా గెలిచారన్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించకపోవడం పట్ల సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ శ్రేణులు అయోమయానికి గురవుతున్నారన్నారు. వెంటనే ఆయనను సూర్యాపేట అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు.

అలుపెరగని పోరాట యోధుడు ఓంకార్



నివాళులర్పిస్తున్న నాయకులు

అర్వపల్లి: అలుపెరగని పోరాటయోధుడు ఓంకార్ అని ఎంసీపీఐ(యూ) డివిజన్ ఇన్‌చార్జి ఈదురు వీరపాపయ్య అన్నారు. ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే దివంగత మద్దికాయల ఓంకార్ వర్ధంతి బుధవారం అర్వపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక తెలంగాణ మహాసభ నాయకుడు వెంకట్, కృష్ణమూర్తి, కిష్టయ్య, చింటు, ఇద్దయ్య పాల్గొన్నారు.

పిడమర్తికి రవికి కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి

అర్వపల్లి: ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ పిడమర్తి రవికి తుంగతుర్తి కాంగ్రెస్ టికెట్ కేటాయించాలని మాదిగ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మీసాల మహేష్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం జాజిరెడ్డిగూడెం దేవాలయంలో పూజలు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుడిగా, ఓయూ జేఏసీ చైర్మన్‌గా తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర వహించారన్నారు. రవికి టికెట్ కేటాయిస్తే గెలుపు ఖాయమని తెలిపారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

- వసతులు లేక అవస్థల్లో విద్యార్థులు
- పలు చోట్ల నిర్మాణ దశలోనే నిలిచిపోయిన కేంద్రాలు



నాగారంలో అద్దెభవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం



పసునూర్‌లో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు

నాగారం: అంగన్‌వాడీ కేంద్రాలు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా సొంతభవనాలకు నోచుకోవడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం పక్కా భవనాలు నిర్మించకపోవడం, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న భవనాల్లో సరైన వసతులు లేకపోవడం.. వెరసి చిన్నారులు, సిబ్బందికి తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. నాగారం మండలంలో పలుచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం పక్కా భవనాలు నిర్మించేందుకు గతంలో నిధులు మంజూరు చేసింది. కానీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఏళ్లు గడిచినా సకాలంలో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. మండలంలో 29 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, వీటి పరిధిలో గర్భిణులు 144 మంది, బాలింతలు 139 మంది, ఆరు నెలల నుంచి మూడేళ్ల చిన్నారులు 679 మంది, 3 ఏళ్ల నుంచి 6ఏళ్ల పిల్లలు 442 మంది ఉన్నారు. మొత్తం 29 అంగన్‌వాడీ కేంద్రాల్లో 16 రెంట్ ఫ్రీ భవనాలు ఉండగా, మరో 12 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కేవలం ఒక్క డి.కొత్తపల్లిలో మాత్రమే అంగన్‌వాడీ పక్కా భవనం ఉంది. గతంలో పసునూర్, పస్తాల గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కాభవనాల ఏర్పాటు కోసం ఒక్కో దానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.6.50లక్షల చొప్పున నిధులు కేటాయించారు. పస్తాలలో అంగన్‌వాడీ భవన పనులు నిర్మాణ దశలో ఉండగా, పసునూర్‌లో కేవలం పిల్లర్ దశకే పరిమితమైంది. అయితే కాంట్రాక్టర్లు సకాలంలో పనులు పూర్తి చేయకపోవడంతో ప్రభుత్వం నిధులు నిలిపివేసింది. దీంతో అంగన్‌వాడీ భవనాలు నిర్మాణ దశలోనే మిగిలిపోయాయి.

అరకొర వసతులు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో అరకొర వసతులతో లబ్ధిదారులకు, నిర్వాహకులకు ఇబ్బందులు తప్పడం లేదు. చాలా చోట్ల రేకుల షెడ్లు, శిథిలావస్థకు చేరిన ఇళ్లే దిక్కవుతున్నాయి. అద్దె భవనాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు సైతం సక్రమంగా లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పక్కా భవనాలను కేటాయించి, మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అద్దె భవనంలో సరైన మౌలిక వసతులు లేవు. వర్షాలు కురిసినప్పుడు గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందించే సరుకులు తడిసిపోతున్నాయి. పక్కా భవనాలు నిర్మించాలి.

– సుమిత్ర, అంగన్‌వాడీ టీచర్, నాగారంబంగ్లా

విద్య, వైద్యం, పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

అర్వపల్లి: పేద ప్రజల సంక్షేమమే బీఎస్పీ మేనిఫెస్టో అని బహుజన సమాజ్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, హైకోర్టు న్యాయవాది దండోలు తిరుపతి అన్నారు. 'గడపగడపకు ఏనుగు.. ప్రగతి భవన్‌కు ఆర్ఎస్పీ' అనే నినాదంతో చేపట్టిన ఎన్నికల ప్రచారం బుధవారం అర్వపల్లికి చేరింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్పీ మేనిఫెస్టోలో విద్య, వైద్యం, పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఆరోపించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో స్థానిక వ్యక్తినే గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శ్రీను, బీఎస్పీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు జీడి వెంకన్న, నియోజకవర్గ అధ్యక్షుడు మల్లెపాక వెంకటేష్, కమటం శోభాబాయి, మండల నాయకులు ఉడుగు శ్రీను, శతకోటి వెంకన్న, వేముల లక్ష్మణ్, మహేష్, నాగేశ్వర్‌రావు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరుపతి

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న రమేష్ రెడ్డి

చివ్వెంల(సూర్యాపేట): కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ హామీలను అమలు చేసి, ప్రజలకు అందిస్తామని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పెద్దిరెడ్డి రాజా, గోదాల రంగారావు, నంద్యాల నరేష్ రెడ్డి పాల్గొన్నారు.

దండుమైసమ్మ ఆలయంలో మండల పూజ

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): మండల పరిధిలోని నెమ్మికల్ దండు మైసమ్మ అమ్మవారి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం జరిగి 41 రోజులు పూర్తికావడంతో బుధవారం మండల పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ కుషలయ్య, ఎంపీటీసీ ముత్తయ్య, కేశవ రెడ్డి, కాస శ్రీనివాస్, నగేష్, సైదులు, సతీష్, కిరణ్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట): రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు పడిదల రవికుమార్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్‌రోడ్ నుంచి మినీ ట్యాంక్ బండ్ వరకు నవంబర్ 5న జరిగే చలో ఇందిరాపార్క్ మాదిగల యుద్ధభేరి సన్నాహక ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమంలో మాదిగలు ముందు వరుసలో నిలబడ్డారని, కేసులు, జైలు జీవితం అనుభవించారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు మాదిగ డిక్లరేషన్ ప్రకటించి రాబోయే ఎన్నికల్లో మాదిగలకు 23 సీట్లు కేటాయించాలన్నారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ హామీకి కట్టుబడి ఉండాలన్నారు. దళితులను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్న సీఎం కేసీఆర్‌కు త్వరలో మాదిగలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. అనంతరం చలో ఇందిరా పార్క్ వద్ద మాదిగల యుద్ధభేరి కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పల్లేటి లక్ష్మణ్‌మాదిగ, బొజ్జ పరశురాంమాదిగ, కనుక జానయ్యమాదిగ, వెంకటేష్, శ్రావణ్, సైదులు, నాగరాజు, రోహిత్, మంజునాథ్, చింటూ, ప్రేమ్ కుమార్, యశ్వంత్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తిరుమలగిరి (తుంగతుర్తి): అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మామిడాల, ఖోక్యానాయక్ తండా, జలాల్‌పురం గ్రామాల్లో ఆ పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాదరి కిశోర్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ నెల 29న తిరుమలగిరిలో జరిగే ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, దూపటి రవీందర్, కందుకూరి లక్ష్మయ్య, తెడ్డు భాస్కర్, యాకూబ్‌నాయక్, సురేందర్, సర్పంచ్‌లు కరుణాకర్, వెంకన్న, కిష్టునాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్'



మాట్లాడుతున్న పసుల అశోక్ యాదవ్

నూతనకల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ పథకాల పేరుతో ప్రజలను మరోసారి మోసం చేస్తున్నారని యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు పసుల అశోక్ యాదవ్ ఆరోపించారు. బుధవారం నూతనకల్ మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు, బీసీ బంధు, గృహలక్ష్మి తదితర పథకాల్లో పారదర్శకత పాటించడం లేదన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలనే లబ్ధిదారులుగా ఎంపిక చేసి నిజమైన అర్హులను విస్మరిస్తున్నారన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ ఎక్కడా జరగలేదన్నారు. ఓటర్లు ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రపహాడ్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు జలగం గౌతమ్‌గౌడ్, కొంగల నరేష్, మధు, అనంతుల విజయ్, చిర్ర మహేష్, వేణు పాల్గొన్నారు.

ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి



జాజిరెడ్డిగూడెంలోని సబ్‌మార్కెట్ యార్డులో మొక్కలకు నీరు పోస్తున్న కార్యదర్శి

అర్వపల్లి: మొక్కలను నీరుపోసి సంరక్షించడంతోపాటు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని జాజిరెడ్డిగూడెం పంచాయతీ కార్యదర్శి నెహ్రూ నాయక్ కోరారు. బుధవారం జాజిరెడ్డిగూడెంలో 'నీరు పోసి మొక్కలను బతికించాలి.. ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌మార్కెట్ యార్డు ఎదుట మొక్కలకు నీళ్లు పోశారు. కార్యక్రమంలో కుంభం నాగరాజు, నిమ్మల యాదయ్య, బొబ్బలి లింగమల్లు, బొల్లం నగేష్, కుంభం రామ్మూర్తి, సైదుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



నాగారం: ఫణిగిరిలో మొక్కలకు నీరు పోస్తున్న సిబ్బంది

మొక్కలు సంరక్షించాలి

నాగారం: మొక్కలకు నీరు పోసి సంరక్షించడంతోపాటు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సర్పంచ్ గట్టు నర్సింహరావు కోరారు. బుధవారం నాగారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో మొక్కలకు నీళ్లు పోసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటుహక్కు కలిగిన ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జిందగిరి, ఆశలు, అంగన్‌వాడీలు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ గ్రామ నూతన కమిటీ ఎన్నిక

నాగారం: మండల పరిధిలోని వర్ధమానుకోటలో బుధవారం ఎన్ఎస్‌యూఐ నూతన గ్రామశాఖ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బుర్ర సోమేష్, ఉపాధ్యక్షులుగా దురుసోజు సతీష్, గంట సతీష్, ప్రధాన కార్యదర్శిగా సింగారపు వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంట మహేష్, కార్యదర్శిగా గండ్లపల్లి వెంకటేష్, సలహాదారుడిగా మామిడ్ల గణేష్, కోశాధికారిగా గడిసె కృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్‌గా గంట విజయ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు కొండగడ్పుల ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు యలమకంటి సోమన్న, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు మొదాల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసమానతలు నిర్మూలించాలి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): ఆడపిల్లలపై వివక్ష, అసమానతలు నిర్మూలించాలని ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ వత్సవాయి లలిత అన్నారు. బుధవారం ఆత్మకూర్ మండల పరిధిలోని ఏపూరులో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలిక సంఘాల లీడర్లు, ఎంవీ ఫౌండేషన్ ఆర్గనైజర్స్ సైదులు, అలివేలు, జయలలిత పాల్గొన్నారు.

లేగ దూడల పంపిణీ

తిరుమలగిరి (తుంగతుర్తి): మండలంలోని వెలిశాల గ్రామంలో రైతులకు బుధవారం జై బంజారా గోశాల ఆధ్వర్యంలో పది లేగ దూడలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్, సూపరింటెండెంట్ రోజా, గోశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



పెన్‌పహాడ్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం అజయ్‌నాయక్



తుంగతుర్తి: వెలుగుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం నర్సయ్య

పెన్‌పహాడ్: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం అజయ్‌నాయక్ కోరారు. బుధవారం మండల పరిధిలోని అనాజీపురం, మహ్మదాపురం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీ సైదులు, వీబీకేలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం నర్సయ్య కోరారు. బుధవారం మండల పరిధిలోని వెలుగుపల్లి, వెంపటి, అన్నారం, గుడితండాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏ- గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, బీ- గ్రేడ్ ధాన్యానికి రూ.2,183 చొప్పున మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ గడ్డం యాదగిరి, నర్సింగ్‌నాయక్, ఆయా గ్రామాల ఐకేపీ నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగనీయొద్దు



నాగారం: మాట్లాడుతున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

నాగారం: ఐకేపీ కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని తహసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. వానాకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై బుధవారం నాగారం మండల కేంద్రంలోని మహిళా సమైక్య కార్యాలయంలో ఐకేపీ నిర్వాహకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు తమ ధాన్యాన్ని 17శాతంలోపు తేమ ఉండేలా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధరను పొందాలన్నారు. మండలంలో 10 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఐకేపీ నిర్వాహకులు తూకాలు సక్రమంగా నిర్వహించాలని, విద్యుత్ సౌకర్యం, ప్యాడీ క్లీనర్ల కొరత లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఏపీఎం ఏపీఎం శోభారాణి, సీసీలు, ఐకేపీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

మద్దిరాల: ఎన్నికల కోడ్ దృష్ట్యా ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు రూ.50వేలకు పైగా నగదును తీసుకెళ్లాల్సి వస్తే తప్పకుండా వాటికి సంబంధించిన ఆధారాలు చూపాలని ఎస్ఐ రవీందర్ అన్నారు. బుధవారం మద్దిరాల మండల పరిధిలోని కుంటపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన పరిశీలించి వాహనాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీఓ రాజేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూన్ పుస్తకాల అందజేత

చివ్వెంల(సూర్యాపేట): మండల పరిధిలోని ఖాసీంపేట అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు బుధవారం రాష్ట్ర ఉత్తమ విశ్రాంత ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుండా రమేష్ రూ.4 వేల విలువజేసే కార్టూన్ పుస్తకాలు అందజేశారు. అదే విధంగా జాతీయ ఉత్తమ అంగన్‌వాడీ టీచర్ అవార్డు పొందిన రేగట్టె వెంకటరమణను సత్కరించారు. కార్యక్రమంలో గుండా శ్రీధర్, నూనె యుగంధర్ పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న రమేష్

బతుకమ్మ వేడుక

సూర్యాపేట : పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో బుధవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ఎదుట బతుకమ్మలను ఉంచి ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, ప్రముఖ పారిశ్రామిక వేత్త మీలా మహదేవ్, మాజీ మార్కెట్ చైర్‌పర్సన్ ఉప్పల లలితా, బీఆర్ఎస్ నాయకుడు చల్లా లక్ష్మీకాంత్, చల్లా ప్రసాద్, వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో..

సూర్యాపేటటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీ వెంకటసాయి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ బాలగౌడ్ పాల్గొన్నారు.

మహాలక్ష్మిదేవిగా కనకదుర్గ అమ్మవారు



భానుపురి: శ్రీరాంనగర్‌లో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు



తిరుమలగిరిలో పూజలు చేస్తున్న భక్తులు



నాగారం: వర్ధమానుకోటలో దుర్గామాత మండపం వద్ద అన్నదానం చేస్తున్న భక్తులు

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలోని శ్రీరాంనగర్‌లో ఏర్పాటు చేసిన మండపం వద్ద దుర్గామాత బుధవారం శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా కాలనీకి చెందిన చిన్నారులు తమ తల్లులకు పాదపూజ చేశారు. శుక్రవారం సామూహిక కుంకుమార్చన, చిన్నారులకు అక్షరాభ్యాసన నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు నాగవెల్లి ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహణ కమిటీ ప్రధాన కార్యదర్శి పర్వతపు వెంకటేశ్వర్లు, కోశాధికారి శ్రీపాద ఉపేందర్, ఉపాధ్యక్షులు సంధ్యాల వినోద్, కీసర అంజన్ రెడ్డి, అవుల వెంకన్న, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.


తిరుమలగిరి (తుంగతుర్తి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గామాత అమ్మవారు కాత్యాయని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెన్‌పహాడ్: మండల పరిధిలోని అన్నారం గ్రామంలో జై శ్రీరామ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం మహాలక్ష్మి దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.


అర్వపల్లి: దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గామాత అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. మండల పరిధిలోని కొమ్మాల గ్రామ వేణుగోపాలస్వామి దేవాలయం ఎదుట ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద దీక్షాస్వాములు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకుడు దరూరి జగన్నాథచార్యులు, స్వాములు పాల్గొన్నారు.


నాగారం: మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద బుధవారం సుమారు 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ యరాల రాంరెడ్డి, చిత్తలూరి యాదగిరి, బండ గొర్ల ఎల్లయ్య, బోయిని లింగమల్లు, ఈరేటి అంజయ్య, బొమ్మగాని నాగయ్య, ఎల్లయ్య, శ్రీను, సోమన్న, నోముల కొమిరెల్లి- రేణుక, కుమారస్వామి- పద్మ దంపతులు పాల్గొన్నారు.

మద్దిరాల: కనకదుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం మద్దిరాల మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో ఆదర్శయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద గ్రామానికి చెందిన హజారి అప్పయ్య అన్నదాన నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు బొమ్మెర సైదులుగౌడ్, బొమ్మెర వెంకన్న, శిలివేరు రాములు, పసుపులేటి రవి, చామకూరి లింగయ్య, దళపతి, చిరంజీవి పాల్గొన్నారు.



సూర్యాపేటటౌన్: బతుకమ్మలతో విద్యార్థినులు





సూర్యాపేట: బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు